

అలసత్వం వహిస్తూ..

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహణలో జిల్లా అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఆలస్యంగా వస్తున్నారు. - 8లో



అంధకారంలో విద్యారంగం

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగం అంధకారంలోకి వెళ్లిపోయిందని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి విమర్శించారు. - 8లో



అక్రమ అరెస్టులతో అణగదొక్కలేరు

వైఎస్సార్‌సీపీ నేతలను అక్రమ అరెస్టులతో అణగదొక్కలేరని, ప్రభుత్వ వైఖరి సరికాదని పలువురు నేతలు మండిపడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

వేద సదృశ్యం.. ఆగమశాస్త్రం



సదస్సుకు హాజరైన అతిథులు, పండితులు

తిరుపతి సిటీ : సాక్షాత్తు భగవంతుడు ఉపదేశించినవి వేదాలని, వాటి సదృశ్యాలే ఆగమ శాస్త్రాలని మైలాపూరం సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అరుణసుందరం తెలిపారు. సంస్కృత వర్సిటీలో నిర్వహిస్తున్న చతురాగమ జాతీయ సదస్సుకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అరుణసుందరం మాట్లాడుతూ వేదాలు భారతీయ సంస్కృతికి దర్పణాలని చెప్పారు. వైఖానస, పాంచారాత్ర, శైవ, తంత్రసార ఆగమాలు వేద సదృశ్యాలేనని వివరించారు. ఆగమోక్త అంశాలపై పరిశోధనలు చేపట్టాలని కోరారు. అనంతరం వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆగమశాస్త్ర సంరక్షణ,, గ్రంథాల ముద్రణకు వర్సిటీ కృషి చేస్తోందన్నారు. త్వరలోనే ఆగమ ప్రదర్శనశాల ఏర్పాటు చేయనున్నట్లు, ఈ మేరకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. టీటీడీ ఎస్వీ వేదపాఠశాల ప్రిన్సిపల్ కుప్పా శివ సుబ్రమణ్య అవధాని, ఆగమ విభాగ అధ్యక్షుడు విష్ణుభట్టాచార్యులు, డీన్ రజనీకాంత్ శుక్లా పాల్గొన్నారు.

ఘాట్‌లో టీటీడీ ఈఓ తనిఖీలు



రోడ్డును పరిశీలిస్తున్న ఈఓ శ్యామలరావు

తిరుమల: తిరుమల రెండో ఘాట్ రోడ్డులో టీటీడీ ఈఓ శ్యామలారావు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అవసరమైన చోట మరమ్మతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఘాట్ రోడ్డులో తగినంత సిబ్బందిని నియమించి తరచూ శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని హెల్త్ విభాగం అధికారులకు సూచించారు.

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం



చెక్ అందిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్ : విధి నిర్వహణలో మరణించిన పోలీసులకు సంబంధించి వారి కుటుంబాలకు ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. అందులో హెడ్‌కానిస్టేబుల్ కామరాజు సతీమణి లక్ష్మి, కానిస్టేబుల్ అశోక్ తండ్రి గోపాల్‌కు చెక్కులను పంపిణీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్ రోశయ్యకు వెల్ఫేర్ ఫండ్ కింద రూ.లక్ష వడ్డీ లేని రుణం మంజూరు చేశారు.

అగాధంలో ఆక్వా

నీలి విప్లవంతో ఒకప్పుడు ఆక్వా రంగం సిరులు కురిపించింది. ప్రధానంగా టైగర్ రొయ్యల సాగు వేలాది మంది రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడింది. లక్షలాది మందికి ఉపాధి కల్పించింది. అయితే ఇప్పుడు వివిధ కారణాలతో ఆక్వా రంగం అగాధంలోకి పడిపోతోంది. అసలే అమెరికా సుంకం దెబ్బకు రైతాంగం దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. ఇదే సమయంలో నకిలీ సీడ్‌తో టైగర్ సాగు ప్రశ్నార్థకంగా మారిపోయింది. లోకల్ బ్రూడర్‌లతో నాణ్యత లేని పిల్లలు కొనుగోలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. ఈ క్రమంలోనే పెరిగిన ఫీడ్ ధరలతో పెట్టుబడి అమాంతం అధికమైంది. దీంతో రొయ్యల సాగు నష్టాల ఊబిలోకి వెళ్లిపోయింది.



ఎదుగుదల లేని రొయ్యలు



హెచరీల ద్వారా సరఫరా అవుతున్న రొయ్య పిల్లలు



అమెరికా సుంకం దెబ్బకు రైతుల ఇక్కట్లు

- నకిలీ సీడ్ అంటగడుతున్న హేచరీలు
- లోకల్ బ్రూడర్‌తో నాణ్యత లేని 'టైగర్' పిల్లలు
- రొయ్యల ఎదుగుదల లేక అవస్థలు
- ఒక్కసారిగా పెరిగిన ఫీడ్ ధరలు
- ఆర్థిక భారం మోయలేమంటున్న సాగుదారులు

చిల్లకూరు : ఆక్వా సాగుపై అమెరికా సుంకం దెబ్బ ఉండగానే, మరో వైపు నకిలీల సీడ్‌ను హేచరీ యాజమాన్యాలు అంటగడుతుండడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నామని గగ్గోలు పెడుతున్నారు. ఇలాంటి గడ్డు పరిస్థితిలో ఇకపై సాగు చేపట్టలేమని రైతులు వదిలిపెట్టేస్తున్నారు. దీంతో గతంలో సాగు చేసే విస్తీర్ణం కంటే మూడు వంతుల విస్తీర్ణం తగ్గిపోయింది. జిల్లా రైతులు చేపట్టే రొయ్యల సాగులో రెండు రకాలు ఉన్నాయి ఒకటి టైగర్, రెండోది వెనామీ. ఈ రెండు రకాల రొయ్య పిల్లలు ఎక్కువ శాతం పాండిచ్చేరి నుంచి తెచ్చుకుంటూ ఉంటారు. ప్రస్తుతం అక్కడ వెనామీకి మాత్రమే ఎక్కువ రేటు ఉండడంతో ఈ రకం సాగుకే రైతుల అధికంగా మొగ్గుచూపుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో టైగర్ హేచరీలను ఐదు ఏర్పాటు చేశారు. అయితే ఒక హేచరీలో మాత్రమే టైగర్ రొయ్య పిల్లలను ఉత్పత్తి చేస్తున్నారు. సాధారణంగా మడగాస్కర్ నుంచి తీసుకువచ్చిన బ్రూడర్ (తల్లి రొయ్య) ద్వారా పిల్లలను ఉత్పత్తి చేసి రైతులకు అందించాల్సిఉంది. అయితే ఇక్కడి హేచరీల నిర్వాహకులు లోకల్ బ్రూడర్ (సముద్రంలో దొరికే తల్లి రొయ్య) ద్వారా పిల్లలను ఉత్పత్తి చేయించి, మడగాస్కర్ సీడ్‌తో కలిపి రైతులకు విక్రయించేస్తున్నారు. నాణ్యత లేని ఈ సీడ్ మూడు నెలలు దాటుతున్నా 5, 10 గ్రాములకు మించి ఎదుగుదల లేకపోవడంతో మేత(ఫీడ్) అధికంగా వేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

బిల్లు లేదు.. రశీదు ఉండదు

రొయ్య పిల్లలను బుక్ చేసుకున్నప్పుడు, సీడ్ అందించినప్పుడు కూడా రైతులకు హేచరీల యాజమాన్యాలు ఎలాంటి బిల్లులు, రశీదులు ఇవ్వడం లేదు. చెల్లింపులను సైతం నగదు రూపంలోనే తీసుకుంటారు. డిజిటల్ లావాదేవీలకు ససేమిరా అంటుంటారు. ఇందుకు ప్రధాన కారణం భవిష్యత్‌లో రొయ్యల రైతులకు ఏమైనా ఇబ్బందులు వస్తే తమకు సంబంధం లేదని తప్పుకునేందుకే ఇలా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రొయ్య పిల్లను హెచరీ నుంచి తీసుకున్న సమయంలో కనీసం ఒక బిల్లు అయినా ఇస్తే నష్టపోయినప్పుడు బీమా అయినా పొందేందుకు వీలుంటుందని రైతులు వెల్లడిస్తున్నారు. అయితే ఇందుకు హేచరీలు ససేమిరా అంటున్నాయని వాపోతున్నారు.

కాలుష్యం కూడా కారణమే..

టైగర్ రొయ్య సాగుకు ఉప్పునీరు కచ్చితంగా అవసరం. అందుకే ఎక్కువ శాతం సముద్ర తీర ప్రాంతంలో టైగర్ సాగు చేపడుతుంటారు. ఈ క్రమంలోనే జిల్లాలోని చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలలో కొంత మేర సముద్ర తీర ప్రాంత ఉండడంతో ఉప్పునీరు పుష్కలంగా దొరుకుతుంది. ఆయా ప్రాంతాల్లోనే అధికంగా టైగర్ రొయ్యల సాగు చేపడుతుంటారు. ఇటీవల కండలేరు క్రీక్, బకింగ్ హామ్ కెనాల్‌లు పూడికతో నిండిపోవడంతో సముద్రం నుంచి ఆటు పోటుల ద్వారా వచ్చే ఉప్పునీరు వీటిలోకి చేరడంలేదు. దీంతో ఉన్న నీరు కలుషితమై రొయ్యల ఎదుగుదల దెబ్బతింటోంది.

ఇదే సమయంలో అమెరికా సుంకాల కారణంగా కొనుగోలుదారులు వెనుకంజవేయడంతో ధరలు పూర్తిగా తగ్గిపోయాయని, నష్టాలకే అమ్ముకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

నాలుగు నెలలు దాటినా..

జిల్లాలో టైగర్ రొయ్య సాగు చేసే రైతులు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని హెచరీ నుంచి రొయ్య పిల్లలను తీసుకుని వచ్చి సాగు చేపట్టారు. మార్చిలో వదలిన రొయ్య పిల్ల మూడు నెలలు అటే జూలై నాటికి కనీసం 40 కౌంట్‌కు రావాల్సి ఉంది. అయితే ఆగస్టుకు కూడా ఎదుగుదల లేక 10 గ్రాములకు మించలేదు. గతంలో రొయ్యల మేత ధరలు సాధారణంగా ఉండగా కూటమి ప్రభుత్వంలో వాటిపై కూడా భారం పడింది. దీంతో వ్యాపారులు తాము పెట్టిన పెట్టుబడిని రాబట్టుకునేందుకు ప్రతి బస్తాపై రూ.10 నుంచి రూ.20 వరకు పెంచేశారు. ఈ భారం ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులుపైనే పడుతోంది. పెట్టుబడి పెట్టుకోలేక వ్యాపారుల వద్ద అప్పుగా ఫీడ్‌ను తీసుకున్న చిన్న కారు రైతులు అధిక ధరల కారణంగా నష్టాలబారిన పడుతున్నారు. గతంలో 25 కేజీల ఫీడ్ బస్తా రూ.2,250 ఉండగా, ప్రస్తుతం అది రూ.2,350కి పెరిగింది. అప్పుగా తీసుకునే చిన్న, సన్నకారు రైతులకు అదనంగా మరో రూ.100 నుంచి రూ.200 వరకు వడ్డీ భారం పడుతోంది.

జిల్లా సమాచారం

హేచరీలు	05
రొయ్య పిల్లలు ఉత్పత్తి చేసే కేంద్రం	01
గతంలో టైగర్ సాగు విస్తీర్ణం	3,250 ఎకరాలు
ప్రస్తుతం సాగు విస్తీర్ణం	825 ఎకరాలు

ఎదుగుదల లేని పిల్లలు

గతంలో మడగస్కర్ నుంచి తీసుకుని వచ్చిన టైగర్ బ్రూడర్ (తల్లి రొయ్య)ను పాండిచ్చేరి, యానం, ఉమ్మడి నెల్లూరు, ఈస్ట్, వెస్ట్ గోదావరి జిల్లాలోని హెచరీల ద్వారా పిల్లలను ఉత్పత్తి చేయించేవారు. అక్కడ నుంచి ఆర్డర్లపై రైతులకు విక్రయించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏర్పాటైన హేచరీలు మాత్రం లోకల్ బ్రూడర్‌తో నాణ్యత లేని పిల్లలను రైతులకు అంటగడుతున్నాయి. టైగర్ సీడ్‌కు డిమాండ్ ఉండడంతో లోకల్ బ్రూడర్‌తో పిల్లలను ఉత్పత్తి చేయించి మడగస్కర్ నుంచి తెచ్చిన బ్రూడర్ ద్వారా వచ్చిన పిల్లలతో కలపి విక్రయించేస్తున్నాయి. అలాగే మడగస్కర్ నుంచి తెచ్చిన బ్రూడర్ ద్వారా నాలుగు పర్యాయాలు మాత్రమే పిల్లలు ఉత్పత్తి చేయాల్సి ఉంది. అయితే ఆర్డర్‌లు ఎక్కువగా వస్తుండడంతో 7, 8 సార్లు పిల్లలు ఉత్పత్తి చేయిస్తున్నారు. దీని వల్ల రొయ్యలు ఎదుగుదల లేక రైతులు తీవ్రంగా నష్టాలు చవి చూడాల్సివస్తోంది.

చితికి పోతున్నాం



ఆక్వా రంగానికి ఇలాంటి గడ్డు పరిస్థితులు ఎప్పుడూ లేవు. ఒకవైపు అమెరికా పన్నులు, మరోవైపు సాగులో ఒడిదుడుకులు ఎదురవడంతో ఆక్వా రంగం పూర్తిగా దెబ్బతింది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రాక ఆర్థికంగా చితికిపోతున్నాం.

– ఎస్.మధురెడ్డి, రైతు, ముట్టెంబాక, వాకాడు మండలం

దూరమవుతున్నాం



ఆక్వా సాగుతో చాలామంది ఉన్నతస్థాయి చేరారు. ఇప్పుడు నకిలీలు పెరిగి పోవడంతో రొయ్యల సాగు అంటేనే భయపడే దుస్థితి దాపురించింది. ప్రధానంగా టైగర్ పిల్లల విషయంలో నకిలీ బెడద పెరిగిపోయింది. నష్టాల కారణంగా ఆక్వా సాగుకు దూరమవుతున్నాం.

– సుధీర్‌రెడ్డి, రైతుల, కృష్ణమనాయుడు కండ్రిగ, చిట్టమూరు మండలం

తనిఖీలు చేపడతాం

హేచరీల నుంచి రైతులకు సరఫరా చేసే రొయ్యల పిల్లల్లో కల్తీ జరుగుతోందని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం. ఆయన అనుమతుల మేరకు తనిఖీలు చేపడతాం. ఎక్కడైనా నకిలీ సీడ్‌ను విక్రయిస్తుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

– రాజేష్, మత్స్యశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి

21న గూడూరులో జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన గూడూరు డీఆర్‌డబ్ల్యూ డిగ్రీ కళాశాలలోజాబ్ మేళా నిర్వహించనున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ పోస్టర్ ఆవిష్కరించారు. 10వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా తదితర కోర్సుల పూర్తి చేసిన మేళాకు అర్హులుగా పేర్కొన్నారు. 20వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అదనపు సమాచారం కోసం 9985056929, 8639835953,9988853335 నంబర్లను సంప్రదించాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి లోకనాథం పాల్గొన్నారు. అనంతరం ఈ నెల 20న ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో కలెక్టర్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

తిరుపతి సిటీ: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెంకడరీ గ్రేడ్ టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కేవీఎస్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. పదేళ్ల సర్వీసు గల టీచర్లు ఈ నెల 24వ తేదీలోపు రెండు సెట్ల ప్రతిపాదనలతో దరఖాస్తులను డీవైఈఓలకు అందించాలని సూచించారు.

అవస్థలు ఉచితం



బస్సులో సీటు దొరుకుతుందా..

- 'స్త్రీశక్తి'కి సరిపడా లేని బస్సులు
- ప్రయాణికులకు తప్పని పడిగాపులు

తిరుపతి అర్బన్: తిరుపతి బస్టాండ్ నుంచి ఉచిత బస్సులు సరిపడా లేకపోడంతో ప్రయాణికులు గంట నుంచి రెండు గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. పల్లెవెలుగు, ఆల్ట్రాపల్లె వెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్‌ల్లో ఉచిత ప్రయాణానికి అవకాశముండడంతో మహిళలు వీటికే మొగ్గుచూపుతున్నారు. 54 నుంచి 56 సీట్లు ఉన్న ఆ మూడు సర్వీసుల్లో 70 మందికి పైగానే ఎక్కేస్తున్నారు. దీంతో సీట్ల కోసం పలువురు పోటీ పడుతున్నారు. కిటికీల్లో నుంచి సీట్ల కోసం బస్సులోకి వెళ్లిపోతున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు అత్యవసరం అయితే తప్ప రెండు వారాలు పాటు సెలవులు పెట్టడానికి వీలు లేదని జిల్లా అధికారులు ఆదేశాలు ఇచ్చారు. అలాగే సెలవుల్లో ఉన్న ఉద్యోగులు సైతం డ్యూటీలకు రావాలని స్పష్టం చేశారు. మొత్తంగా ఆర్టీసీ అధికారులు ఉచిత బస్సులపైనే ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలుస్తుంది.

విద్యార్థినులకు చేదు అనుభవం

దొరవారిసత్రం : స్త్రీశక్తి పేరిట మహిళలకు ఆర్‌టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అయితే ఆ వెసులుబాటును కొన్ని సర్వీసులకు మాత్రమే పరిమితం చేసింది. అలాగే పలు నిబంధనలను సైతం విధించింది. ఈ క్రమంలోనే సోమవారం నాయుడుపేట నుంచి తిరుపతికి వెళ్లే గూడూరు డిపోకు చెందిన (ఏపీ40జెడ్0479) ఎక్స్‌ప్రెస్ బస్సులో విద్యార్థినులకు చేదు అనుభవం ఎదురైంది. ఇంజినీరింగ్ చదివే విద్యార్థినులు బస్సు ఎక్కిన తర్వాత స్మార్ట్ ఫోన్లలో ఆధార్ కార్డులను చూపినప్పటికీ కండక్టర్ ససేమిరా అన్నారు. ఒరిజినల్ ఆధార్ చూపిస్తేనే ఉచితమని కండక్టర్ చెప్పడంతో ఆ విద్యార్థులు విధిలేని పరిస్థితిలో టికెట్లు తీసుకోకతప్పలేదు.

మాకు ఉచితం లేదా



ఆధార్ కార్డులు లేకపోతే ఉచిత ప్రయాణం కుదరదని మా ముగ్గురి వద్ద రూ.100 చొప్పున కండక్టర్ రూ.300 రూపాయలు టికెట్ కొట్టారు. స్మార్ట్ ఫోన్లలో ఉన్న ఆధార్ కార్డులను చూపినప్పటికీ ఇవి చెల్లవంటూ బస్ కండక్టర్ టికెట్ కొట్టి చేతిలో పెట్టారు.

– సరయు, తన్మయి, లహరి, ఇంజినీరింగ్ విద్యార్థులు

ఫోన్‌లో చూపినా చాలు

రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో ఉత్తర్వులు వచ్చేవరకు ఆర్టీసీ బస్సుల్లో ఎక్కే మహిళా ప్రయాణికులు చేతిలో ఆధార్ ఉన్నా లేకపోయి సెల్‌ఫోన్‌లో చూపి ప్రయాణం చేయొచ్చు. అన్ని డిపోల్లోని కండక్టర్లకు దీనిపై అవగాహన కల్పించాం.

– జగదీష్, ఆర్టీసీ ఆర్‌ఎం, తిరుపతి

కొత్త పాలసీ.. బార్‌లా తెరిచేసి!



జనాలను మద్యం మత్తులో ఉంచేందుకు ప్రభుత్వం అన్ని దారులను 'బార్'లా తెరిచేసింది. అందులో భాగంగా నూతన పాలసీని తీసుకువచ్చింది. జిల్లాలో 32 బార్లు ఏర్పాటు చేసుకునేందుకు నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇందులో కల్లుగీత కార్మికులకు మూడింటిని కేటాయించింది. ఈ క్రమంలోనే మందుబాబులకు ప్రోత్సాహంగా మద్యం తాగించేందుకు వీలుగా మరో 2 గంటల అదనపు సమయం మంజూరు చేసింది.

- జిల్లాలో 32 బార్లకు నోటిఫికేషన్
- గీత కార్మికులకు 3 కేటాయింపు
- మద్యం తాగించేందుకు మరో 2 గంటలు పెంపు



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ విజయ్ శేఖర్, సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైమ్ : జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 11 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 227 మద్యం షాపులు ఉన్నాయి. వాటికి అనుసంధానంగా నాలుగు రోజుల క్రితం పర్మిట్ రూములకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇదే అదునుగా అనధికారికంగా ఇప్పటికే మరో 300 కి పైగా వెలిశాయి. జిల్లాలో ప్రస్తుతం రోజూ రూ.2.5 కోట్ల నుంచి రూ.3కోట్లకు పైగా మద్యం వ్యాపారం నడుస్తోంది. ఈ క్రమంలోనే నూతన మద్యం బార్లకు జిల్లాలో మొత్తం 32 లైసెన్సులు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం ఈ మేరకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డీసీ విజయ్ శేఖర్, సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ రెడ్డి నూతన మద్యం పాలసీ నోటిఫికేషన్ విడుదల చేశారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి మూడేళ్ల పాటు జిల్లాలో ఈ నూతన పాలసీ అమలు కానుంది.

వివరాలు ఇలా..

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 17, శ్రీకాళహస్తి-3, పుత్తూరు-1 చంద్రగిరి టూరిజం సెంటర్-1 గూడూరు-3 నాయుడుపేట-1 సూళ్లూరుపేట-2 వెంకటగిరి-1తోపాటు కల్లుగీత కార్మికులకు తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరులో ఒక్కోటి కేటాయించారు. కల్లుగీత కార్మికులకు రూ.27.50 లక్షలను ఫీజుగా నిర్ణయించారు. ఓపెన్ కేటగిరీ బార్లకు రూ.55 లక్షలు రుసుముగా ఉండగా.. నాయుడుపేట సూళ్లూరుపేటకు మాత్రం రూ.35 లక్షలుగా ప్రకటించారు. ఏటా 10 శాతం వరకు ఫీజు పెంచాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఆసక్తిగలవారు మంగళవారం నుంచి httpr://oc.hpfrpsoject.com అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో కూడా దరఖాస్తులు అందించవచ్చని తెలిపారు. ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి ఎన్ని బార్లకు అయినా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

నాన్ రీఫండబుల్ డిపాజిట్

దరఖాస్తుదారులు రూ.5.10లక్షల డిపాజిట్ చెల్లించాలని అధికారులు వెల్లడించారు. ఈ నగదు నాన్ రీఫండబుల్ అని స్పష్టం చేశారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు అందించాలని చెప్పారు. 28 తేదీ ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో లైసెన్సులు కేటాయిస్తామన్నారు. లైసెన్స్ పొంది వారు సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి బార్లు ఏర్పాటు చేసుకోవచ్చని వెల్లడించారు.

అదనపు 'కిక్కు'

కూటమి ప్రభుత్వం నూతన మద్యం బార్ పాలసీని ద్వారా మందు బాబులకు అదనపు కిక్కును అందిస్తోంది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకే బార్‌లో మద్యం తాగేందుకు అనుమతి ఉండేది. నూతన పాలసీలో ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు బార్లు నడుపుకునేలా ఆదేశాల్లో పేర్కొన్నారు. వైన్‌షాపులు మూసివేసిన తర్వాత కూడా రెండు గంటల పాటు బార్లలో మద్యం అందుబాటులో ఉంటుంది. బార్ లైసెన్సులు వచ్చిన తర్వాత రెస్టారెంట్ లైసెన్స్‌ను 30 రోజుల్లో తీసుకుంటే సరిపోతుంది. బార్ లైసెన్సు వచ్చినవారు ఆరు కంతుల్లో పూర్తి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆదాయం పెంచుకునేందుకు ప్రజారోగ్యాన్ని కూటమి ప్రభుత్వం పణంగా పెట్టేలా నూతన పాలసీ రూపొందించిందని పలువురు విమర్శలు గుప్పించడం గమనార్హం.

క్లుప్తంగా

టీటీడీ ఉద్యోగి ఇంట్లో చోరీ

తిరుపతి క్రైమ్ : తిరుపతిలోని బైరాగిపట్టెడలో పద్మావతి పార్క్ ఎదురుగా టీటీడీ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగిన ఘటన సోమవారం వెలుగుచూసింది. క్రైమ్ సీఐ ప్రకాష్ కథనం మేరకు.. టీటీడీలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఈనెల 14వ తేదీన సొంత పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. సోమవారం వేకువజామున తిరిగి ఇంటికి వచ్చారు. మెయిన్ గేటు, తలుపులు పగులగొట్టి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో 207 గ్రాముల బంగారం, 460 గ్రాముల వెండి అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు. పాత నేరస్తులే చోరీకి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించామని, దర్యాప్తు కొనసాగుతోందని సీఐ వెల్లడించారు.

ఎస్వీయూ జోనల్ స్థాయి పోటీలు ప్రారంభం



జోనల్ స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్

తిరుపతి సిటీ: నేషనల్ స్పోర్ట్స్ డేని పురస్కరించుకుని సోమవారం ఎస్వీయూ తారకరామా స్టేడియంలో జోనల్ స్థాయి పోటీలను శాప్ చైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. సుమారు 8 జిల్లాల నుంచి విచ్చేసిన 1700 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు ఈ నెల 29న జరిగే స్పోర్ట్స్ డే కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా నగదు, ప్రశంసాపత్రాలు, పతకాలు అందించనున్నట్లు తెలిపారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతి పాఠశాలలో ఆటస్థలాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం రూ.30 వేల నిధులు పాఠశాలలకు ఖర్చుచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డీఎస్డీఓలు శశిధర్, బాలాజీ, ఉదయ్, రాజు, జగన్, పెద్ద సంఖ్యలో కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



చరిత్



మోక్షిత్, గృశ్నేశ్వర్

గూడూరురూరల్ : సౌత్‌జోన్ ఆర్చరీ పోటీల్లో లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి కె.చరిత్ ప్రతిభను కనబరచినట్లు కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి సోమవారం తెలిపారు. అలాగే ఆదివారం ఒంగోలులో నిర్వహించిన ఆలిండియా కరాటే ఓపెన్ చాంపియన్ షిప్‌లో గూడూరులోని సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు మోక్షిత్, గృశ్నేశ్వర్ ద్వితీయ పొందినట్లు హెచ్‌ఎం దయాకర్ తెలిపారు.

అలసత్వం వహిస్తూ.. ఆలస్యంగా వస్తూ!

- కలెక్టరేట్‌లో 10గంటలకు గ్రీవెన్స్
- 12 గంటలకు వచ్చిన అధికారులు
- అర్జీదారులను పట్టించుకోని సిబ్బంది



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. కలెక్టర్ హాజరైతే ఒక లెక్క.. ఆయన లేకుంటే ఒక లెక్క అన్నట్లు వ్యవహరిస్తున్నారు. తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొని సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఆలస్యంగా వచ్చారు. ఇదే అదునుగా ఉన్నతాధికారులు సైతం వినతుల స్వీకరణకు నింపాదిగా తరలివచ్చారు. ఉదయం 10 గంటలకు గ్రీవెన్స్ మొదలైతే మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక్కొక్కరుగా చేరుకున్నారు. అయితే 12.15 గంటలకు కలెక్టర్ వచ్చేసరికి మాత్రం జిల్లా అధికారులందరూ హాజరుకావడం గమనార్హం. కలెక్టర్ లేరని అధికారులు ఆలస్యంగా రావడంపై అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పైగా కనీస వసతులు సైతం కల్పించకుండా కలెక్టరేట్ సిబ్బంది నిర్లక్ష్యం వహించారని వాపోయారు. దాహంతో అలమటిస్తున్నప్పటికీ తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వినతుల వెల్లువ

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 238 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో ప్రతి వినతిని నిశితంగా పరిశీలించి, పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్ పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 72 అర్జీలు



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 72 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఆయా అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

న్యాయం కోసం పోరాడుతాం



వెంకటగిరి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును బదిలీ చేయాలని పారిశుద్ధ్య కార్మికులు, దళిత సంఘం నేతలు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ఈ మేరకు ధర్నా చేపట్టారు. దళిత కార్మికులను ఆయన కులం పేరుతో దూషిస్తున్నారని ఆరోపించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు.

హామీ నిలబెట్టుకోవాలి



సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు స్థానిక సంస్థ ఎన్నికల్లో 50శాతం సీట్లు కేటాయించాలని బహుజన సమాజ్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ఈ మేరకు ధర్నా నిర్వహించారు. చంద్రబాబు మాట నిలబెట్టుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు.

పింఛన్ తొలగించారు



తిరుపతిలోని కర్నాల వీధిలో నివాసిస్తున్నా. పూర్తిగా దివ్యాంగురాలిని. ఒక్క అడుగు కూడా పెట్టలేను. గతంలో 75శాతం వైకల్యంతో సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. ఇప్పుడు 40శాతానికి కుదించారు. దీంతో సచివాలయ సిబ్బంది నన్ను పింఛన్ జాబితా నుంచి తొలగించారు. నాకు తల్లిదండ్రులు లేరు. కేవలం పింఛన్ సొమ్ముతోనే జీవిస్తున్నా. మళ్లీ నాకు పింఛన్ ఇప్పించాలని కోరుతున్నా.

– కుప్పచ్చి అరుణ, తిరుపతి

పొట్టకొడుతున్నారు



నాకు చెవుడు, మరుగుజ్జుని కావడంతో వివాహం కాలేదు. ఒంటరి మహిళను. సుమారు పదేళ్లుగా పింఛన్ డబ్బులతోనే బతుకుతున్నా. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో నా పొట్టకొడుతున్నారు. సెప్టెంబర్ నుంచి పింఛన్ ఇవ్వమని సచివాలయ ఉద్యోగులు నోటీసు ఇచ్చారు. ఏం చేయాలో తెలియడం లేదు. మాలాంటి వారితో ప్రభుత్వం ఆడుకోవడం సరికాదు. మాకు న్యాయం చేయండి. – సుబ్బమ్మ, వేముగుంటపాళెం, నాయుడుపేట మండలం

కనికరం చూపండి



నాకు ఒక కన్ను పూర్తిగా పోయింది. ఇంకోటి సరిగా కనపడదు. అంధురాలిగా అష్టకష్టాలు పడుతున్నా. 2010 నుంచి దివ్యాంగ పింఛన్ ఇస్తున్నారు. ఆ డబ్బులతోనే బతుకుతున్నా. ఇప్పుడు నా పింఛన తొలగిస్తున్నట్లు సచివాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు. నా భర్త కస్తూరయ్య ఆరోగ్యం సరిగా లేదు. ఈ పరిస్థితుల్లో పింఛన్ తొలగిస్తే మేం బతికేదెట్టాగో కూడా తెలియడం లేదు. కనికరం చూపండి అని అధికారులను వేడుకున్నా.

– సాని కోటమ్మ, మడివల్లం, నాయుడుపేట

కలెక్టర్ గారూ.. పద్మగిరిని కాపాడండి!



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న తనపల్లె నివాసి హేమంతకుమార్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని తనపల్లెకు ఆనుకుని ఉన్న పద్మగిరి కొండను కాపాడండి సార్.. కలెక్టర్ గారూ.. అంటూ ఆలయ కమిటీ సభ్యులు విజయసింహారెడ్డి కుమారుడు హేమంత్‌కుమార్ రెడ్డి వినతిపత్రం అందించారు. సోమవారం కలెక్టర్‌ను కలసిన ఆయన ఈ నెల 16వ తేదీన ‘గుట్టుగా గుట్టమీద పాగా!’ అన్న శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. పద్మగిరిని చెరబట్టారని పలు వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆక్రమణల వల్ల కోట్లు ఖర్చు పెట్టి కొండపైకి నిర్మించిన రహదారి కుంగిపోయే ప్రమాదముందని వివరించారు. ఆ మేరకు స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ తిరుపతి రూరల్ తహసీల్దారుకు రెండు సార్లు ఫోన్ చేయగా ఆయన ఫోన్ పనిచేయలేదు.. దీంతో వీళ్లు పనిచేయరు.. వీళ్ల ఫోను పనిచేయదు.. అంటూ అసహనం వ్యక్తం చేస్తూ సదరు అర్జీపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ సంతకం చేశారు. ఆ కాపీని తహసీల్దారును కలసి అందజేయాలని అర్జీదారు హేమంత్‌కుమార్‌రెడ్డికి కలెక్టర్ సూచించడంతో ఆయన తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. అయితే కార్యాలయంలో తహసీల్దారు రామాంజులు నాయక్ అందుబాటులో లేకపోవడంతో వెనుదిరగాల్సి వచ్చింది.

తొలగింపుపై తిరుగుబాటు!



SRI VENKATESWARA UNIVERSITY

వీసీకి ఈసీ మెంబర్ రాసిన లేఖ

తిరుపతి సిటీ : ఎస్వీయూలో అధికారుల అత్యుత్సాహంతో వీధినపడిన 43 మంది తాత్కాలిక అధ్యాపకుల విషయంలో ఈసీ మెంబర్లు పునరాలోచించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా పాలకమండలి సభ్యులు ఒక్కొక్కరూ తమ తిరుగుబాటు స్వరం వినిపిస్తున్నారు. సుమారు 15ఏళ్ల నుంచి 20ఏళ్ల పాటు వర్సిటీకి సేవలందించిన అకడమిక్ కన్సల్టెంట్లను పెర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించిన వర్సిటీ అధికారులు ఒక్కో ఈసీ మెంబర్‌పై ఒత్తిడి తెచ్చి ఆమోదపు పత్రాలను తెప్పించుకున్నారు. నిబంధనల ప్రకారం ఈసీ మీటింగ్ నిర్వహించి తాత్కాలిక అధ్యాపకుల ఇంటర్వ్యూల నిర్వహణపైన, తొలగింపు ప్రక్రియపైనా ఈసీ ఆమోదం పొందాల్సి ఉంది. వర్సిటీ అధికారులు చాకచక్యంగా వారిని మభ్యపెట్టి తొలగింపు ప్రక్రియపై పూర్తి వివరాలను అందించకుండా ఈసీ ఆమోదం పొందినట్లు ప్రకటించారు. వెంటనే క్షణం ఆలస్యం చేయకుండా అర్హులైన అధ్యాపకులను సైతం రోడ్డున పడేశారు.

అవగాహన లేకనే...ఆమోదం తెలిపా...

ఎస్వీయూలో 43 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను తొలగించడం బాధాకరమని, ఈ మేరకు తాను సమ్మతి తెలుపుతూ పంపిన లేఖను ఉపసంహరించుకుంటున్నానని పాలకమండలి సభ్యులు వి.జ్యోతి తెలిపారు. సోమవారం ఈ మేరకు వీసీ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. తాను అవగాహన లోపంతో ఆమోదం తెలపానని పేర్కొన్నారు. అధికారులు తక్షణం పాలకమండలి సమావేశం ఏర్పాటు చేసి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

జంతు పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : శేషాచల జీవవైవిధ్య అభయారణ్యంలో అంతరించిపోతున్న మూషిక జింక, బంగారు బల్లి, దేవాంగ పిల్లి, రంగుల ఉడుత, పసుపు గొంతు పిగిలి పిట్ట వంటి అరుదైన జంతు జాతుల పరిరక్షణ అందరి బాధ్యతని, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందో తెలిపాలని ఎంపీ మద్దిల గురుమూర్తి ప్రశ్నించారు. సోమవారం ఆయన పార్లమెంటులో మాట్లాడారు. వన్యప్రాణుల రక్షణ, వేటగాళ్ల నిరోధం, ప్రజల భాగస్వామ్యం వంటి చర్యల కోసం నిధులు కేటాయిస్తున్నారా? అని ప్రశ్నించారు.కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ సమాధానమిస్తూ ‘వన్యప్రాణుల నివాసాల అభివృద్ధి’ పథకం కింద రాష్ట్రానికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని వెల్లడించారు. రూ.121.63 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. అనంతరం ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలం సింహాచలకండ్రిగలో 125 ఎకరాల రక్షిత అటవీ భూమిని టీడీపీ ప్రజా ప్రతినిధి స్వాహా చేసేందుకు యత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రక్షిత అటవీ భూములను కాపాడడం సంబంధిత అధికారుల బాధ్యతని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

అంధకారంలో విద్యారంగం



జీఓ ప్రతులను చించివేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తదితరులు

తిరుపతి రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగం అంధకారంలోకి వెళ్లిపోయిందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆరోపించారు. విద్యార్థి సంఘాల అణచివేతకు ప్రభుత్వం జారీ చేసిన జీఓలకు వ్యతిరేకంగా సోమవారం ఎస్వీయూ ప్రధాన ద్వారం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ అక్రమ జీఓలను ఉపసంహరించుకోకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థి సంఘాలను నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందన్నారు. విద్య రంగంపై ఏ మాత్రం అవగాహనలేని నారా లోకేష్‌కు ఆ శాఖ అప్పగించడంతోనే ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. విద్యార్థి సంఘాలపై నిషేధం విధించిన మంత్రి నారా లోకేష్ తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జీఓ ప్రతులను చించివేసి నిరసన తెలిపారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, నేతలు చెంగల్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, రఫీ, ప్రదీప్, భానుప్రకాష్‌రెడ్డి, వినోద్, రాజేంద్ర, నరేష్, మునిరాజ, ప్రేమ్‌కుమార్, హరినాథ్, పార్థసారధి, యుగంధర్, సుధాకర్, ముని, ప్రభు, శేషరెడ్డి, వెంకట్ రమణ నాయక్, వీర నాగేంద్ర, హరిబాబు, నవీన్‌రెడ్డి, దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఏర్పేడు: ఏర్పేడు– శ్రీకాళహస్తి మార్గం మేర్లపాక సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎస్.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌కు చెందినపాళెం ప్రకాష్(29) ఆదివారం రాత్రి బైక్‌పై శ్రీకాళహస్తి నుంచి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీపై కేసు నమోదు

వరదయ్యపాళెం: కేవీబీపురం పవనివారికండ్రిగలోని వెంకటరత్నం అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగిన విషయం సోమవారం వెలుగుచూసింది. బాధితుడు మూడు నెలల క్రితం బీరువాలో రూ.30వేల నగదు, మూడు సవర్ల బంగారం దాచాడు. తీరా సోమవారం బీరువా తెరిచి చూడగా సొత్తు మాయమైంది. దీనిపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

● మా పొట్టలు కొట్టొద్దు



‘మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ మా పొట్టలు కొట్టడం న్యాయమేనా’ అంటూ చిట్టమూరు మండలంలో సోమవారం ఆటోడ్రైవర్లు నిరసన తెలిపారు. చిట్టమూరు మండలం కొత్తగుంటలో సోమవారం ఆటోడ్రైవర్లు ఆర్టీసీ బస్సును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమంటూ పల్లె వెలుగు బస్సులను ప్రవేశ పెట్టారని, దీనివల్ల పల్లెల్లో ప్రయాణికులను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లే ఆటోవాలాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. గత ప్రభుత్వంలో ఆటోడ్రైవర్లకు ఏడాది రూ.10 వేలు ఇచ్చేవారని, ప్రస్తుతం అది కూడా లేకపోవడంతో తమ బతుకులు దుర్భరంగా మారాయని వాపోయారు. ప్రభుత్వం ఆటో వాలాలపై దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు.

– చిట్టమూరు

అక్రమ అరెస్టులతో అణగదొక్కలేరు



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న చిన్నగొట్టిగల్లు నేతలు

భాకరాపేట : అక్రమంగా అరెస్ట్ చేసి వైఎస్సార్‌సీపీ నేతలను అణగదొక్కలేరని, పెద్దిరెడ్డి కుటుంబీకులను భయపెట్టాలనుకోవడం మూర్ఖత్వమని పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌కు నిరసనగా, పెద్దిరెడ్డి కుటుంబానికి సంఘీభావంగా సోమవారం పీలేరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తన ఆత్మసంతృప్తి కోసమే మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయించారని మండిపడ్డారు. ఇలాంటి పనికిమాలిన రాజకీయాలు మానుకోవాలని, లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవ రెడ్డి మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టినందుకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. దశాబ్దాలుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదుర్కోలేక ఆయన కుమారుడిని అరెస్ట్ చేసి కుంగదీయాలనుకోవడం హాస్యాస్పదమని తెలిపారు. ఈ వేధింపులకు పెద్దిరెడ్డి ఏమాత్రం భయపడరని, మరింత ఉత్సాహంగా పనిచేస్తారని వెల్లడించారు.

మందుల విక్రయానికి ప్రత్యేక రిజిస్టర్



మాట్లాడుతున్న జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శాంతి

చిల్లకూరు : మెడికల్ షాపు యజమానులు మందుల విక్రయానికి ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని, ప్రధానంగా వైద్యులు సూచించిన మత్తు ఇచ్చే మెడిసిన్‌ల వివరాలను నమోదు చేయాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శాంతి ఆదేశించారు. సోమవారం గూడూరులోని సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో మందుల షాపుల యజమానులు, ఏరియా ఆస్పత్రి వైద్యులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మందు షాపుల యజమానులు మత్తు కలిగించే వాటిని కొనుగోలు చేసే సమయంలో పక్కాగా రశీదులు తీసుకోవాలని స్పష్టం చేశారు. వైద్యులు రమేష్, ఎస్‌ఐ షాజహాన్, మందుల షాపు యజమానుల సంఘం అధ్యక్షుడు బత్తిన సుధాకర్, కార్యదర్శి సుభాన్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఒకరి అరెస్ట్

చిల్లకూరు : మండలంలోని మోమిడిలో ఈ నెల 7వ తేదీన జరిగిన దాడి కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో మత్స్యకారులకు, ఓ ముస్లిం కుటుంబానికి బోట్ల విషయంలో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో 8 మంది తమపై దాడి చేశారని ముస్లింలు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఏడో నిందితుడు వేమారెడ్డి కుమారస్వామిరెడ్డిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు.

జర్మనీ భాషపై ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్ : ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీ భాషపై ఉచితంగా ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఇస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర కులాల వారికి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని వెల్లడించారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి 6 నెలల క్లినికల్ అనుభవం, జీఎన్‌ఎం నర్సింగ్ పూర్తి చేసి 2 ఏళ్ల క్లినికల్ అనుభవం గల 35ఏళ్లలోపువారు అర్హులని చెప్పారు.ఆసక్తిగలవారు ఈ నెల 21వ తేదీలోపు పేర్లునమోదు చేయించుకోవాలని కోరారు. ఈనెల 22 నుంచి తొలి బ్యాచ్ ప్రారంభిస్తారని పేర్కొన్నా రు. బైరాగిపట్టెడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 9160912690 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పింఛన్ల తొలగింపుపై ఆందోళన

కలువాయి(సైదాపురం) : పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసుల అందిన నేపథ్యంలో పలువురు దివ్యాంగులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. మండలంలో దాదాపు 92 మందికి పింఛన్లు నిలిపివేస్తుండడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పక్షవాతంతో మంచాన పడిన వారికి సైతం పెన్షన్ తీసివేయడంపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కనీసం మాత్రం కనికరం కూడా లేకుండా దివ్యాంగుల ఉసురు పోసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు తగు న్యాయం చేయాలని కోరారు.

కానిస్టేబుల్‌కు రివార్డు



గుర్రప్పకు రివార్డు అందిస్తున్న ఎస్పీ

తిరుపతి క్రైమ్ : తిరుమలలో ఈ నెల 15వ తేదీన గుండెపోటుకు గురైన శ్రీనివాస్(60) అనే భక్తుడికి సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ గుర్రప్పకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం రివార్డు అందించారు. గుర్రప్ప స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవాభావంతో నడుచుకోవాలని ఎస్పీ సూచించారు.

మీసేవ నిర్వాహకుడిపై విచారణ

కలువాయి(సైదాపురం): అక్రమంగా నగదు వసూళ్లకు పాల్పడుతున్న కలువాయి మీసేవ కేంద్రం నిర్వాహకుడు వెంకటరత్నంపై డీఎల్‌పీఓ రమణయ్య సోమవారం విచారణ చేపట్టారు. 1బీ అండగల్, పాస్‌బుక్ అప్లై చేసేందుకు అధిక మొత్తంలో నగదు తీసుకున్నాడని విశ్రాంత ఉపాధ్యాయుడు కాకివాయి గోపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు డీఎల్‌పీఓ రమణయ్య వెల్లడించారు.

270 ఆటోలకు జరిమానా

తిరుపతి క్రైమ్ : రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ నెల 12వ తేదీ నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 270 ఆటోలకు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ ఆచారి తెలిపారు. సోమవారం సైతం తనిఖీలు నిర్వహించామని, ఇప్పటి వరకు 27 ఆటోలను సీజ్ చేశామని వెల్లడించారు. డ్రైవ్ కొనసాగుతుందని స్పష్టం చేశారు.